# 1, 2, 3, 4, 5, 6, 7, 8

(యంత్రం, సంగీతం, సంగీతయంత్రం, ప్రేమ, విషాదం, కలిసిన కథ. ప్రథమపురుషలో చెబుతూ హఠాత్తుగా ఉత్తమపురుషలోనికి కథను మార్చడంలో రచయిత వైదగ్ధ్యం గోచరిస్తుంది. కథారచనలో నవీన సంవిధానానికి ముందుగా పేర్కొనవలసినవాడు సారోయాన్. అతని ఉత్కృష్ట కథలలో ఒకటిగా దీన్ని పాఠకులకు పరిచయం చేస్తున్నాను—అనువాదకుడు.)

**1927** లో న్యూయార్కులోని వుల్‌వర్తు విక్రయశాలా భవనాల్లో తిరుగుతుండగా చూశాడతను, చాలమంది ఒక పెద్ద టేబిలుముందు నిలబడి ఎత్తుగా, ఫోనోగ్రాఫ్ రికార్డులు పేరుస్తూండడం. సంగతేమిటో కనుక్కుందామని దగ్గరగా వెళ్ళాడు. ప్రత్యేక విక్రయం, Victor & Brunswick కంపెనీ వారి కొత్త రికార్డులు, ఒక్కొక్కటి అయిదు సెంట్లు, కావలసినన్ని రకాలు—ఇష్టం వచ్చినవి యెంచుకోవచ్చు. ఎన్ని నెలలయింది తాను ఫోనోగ్రాపు వేసుకొని. ఇంకోసారి కీ యిచ్చి మళ్ళీ వినాలనిపించింది. చాలమట్టుకు తానూ, తన ఫోనోగ్రాఫూ ఒకటే. ఆ యంత్రంలోకి వెళ్ళి, అందులోంచి వచ్చి, తనే సంగీతమైపోయాడు. ఒకసారి విద్వాంసుల కృతి, మరోసారి జాజ్ పాటల వికృతి. ఎన్నో నెలలయింది ఫోనోగ్రాపు దగ్గరకెళ్ళి, అలాగే తన గదిలో పడివుంది ధూళిపట్టి మౌనంగా.

తానే ఈ ఫోనోగ్రాపులో చిరకాలంనుంచి మౌనంగా ఉండిపోయాననీ, ఇందులోంచి మళ్ళీ బైటికి రావడం ఎంతో బాగుంటుందనీ ఈ అయిదు సెంట్ల రికార్డులు జ్ఞాపకం చేశాయి.

ఒక అర డజను రికార్డులు ఎంచుకొని తనగదికి తీసుకువెళ్ళాడు. వీటిలో ఏదీ గొప్ప సంగీతం కాదని నిశ్చయంగా తెలుసు. కాని ప్రశస్తమైనదే కావాలన్న పట్టింపు లేదు ఆ సంగీతం ఎంత హీనంగా వున్నా, ఎంత నాసిరకానిదైనా ఏమీ ఇబ్బంది లేదు. ఏదైనాసరే, దాని సంగతేదో తెలుసుకోవడంలో గొప్ప మజా వుంటుంది. అమెరికన్ జాజ్ సంగీతం అంతట్లోకీ అతి హీనమైనది దొరికినా దానితో ఈ పని చెయ్యగలనని అతనికి తెలుసు. రాగం చెడిపోవడం. వాద్యమేళం గగ్గోలు వగైరా. ఎంత చెడిపోయిందయినా సరే, ఎక్కడో ఒకచోట, జాగ్రత్తగా వింటే తప్పకుండా తాను జరామరణపీడితుడైన మానవుడి అమోఘవిలాపమో, హసనమో వినితీరుతాడు.

ఒకసారి అది వినిపిస్తుంది హఠాత్తుగా మ్రోగి ఆగిపోయే ఎదురుమ్రోతలో- బహుశా బాంజోతీగలన్నీ ఒక్కుమ్మడి గజగజలాడినప్పుడు—లేదా ఇంకోసారి ఏదో ఒక చెత్తపాటని అనేకమందితోకలిపి పాడుతున్న ఒక కిరాయిగాయకుడి గొంతుకలో వినిపించే విషాదం, ఏదో చాలామట్టుకు కాకతాళీయంగా, కాని తప్పనిసరిగా.

ఉత్తమసంగీతంలో ఇది సాధ్యం కాదు. ఉత్తమసంగీతంలోని ఉన్నత గుణాలన్నీ ఉద్దేశపూర్వకాలు. అవి అందరికోసం అక్కడ హత్తుకొని పోయిఉన్నాయి. దాంట్లో పొరపాటుకి తావులేదు.

అది ఆగస్టునెల ఆరంభం అనుకుంటాను. (ఈ మాట చెబుతున్నది నేను, వాడు చాలా నెలలబట్టీ ఫోనోగ్రాపులోంచి తన్ను వినడంలేదు. ఇప్పుడే కొత్త రికార్డులని ఇంటికి తీసుకెళ్ళుతున్నాడు.)

యువకుడైనవాడు అగస్టు మాసంలో చెప్పరానంత జీవనమాధుర్యం అనుభవిస్తాడు. ఆ రోజుల్లో నాకొక టెలిగ్రాపు కంపెనీలో ఉద్యోగం. పగలంతా ఒక టేబిలుముందు కూర్చుని టెలీటైపు యంత్రంతో పని చేసేవాడిని—టెలిగ్రాములు పంపడం, అందుకోవడం సాయంత్రం అయేసరికి ఒక అనిర్వచనీయమయిన మాధుర్యం నాకు అనుభవమయేది. కాని అదే సమయంలో నాకెవరూ లేరనే ఒంటరితనం వేధించేది. వీళ్ళమధ్య నన్ను పారేసేరేమిటనే వేదన. ఈ యంత్రాల మధ్య పడిపోయాను. మీ పద్మవ్యూహంలో నన్ను తోసేశారు. ఈనాటి యంత్రాలభావంలో ఇరుక్కొని ఆఖరికి నేనూ ఈ మరల్లోనే ఒక భాగాన్నయిపోయాను. ధనార్జనకి ఇదో మార్గం—ఇలా ఒక యంత్రంముందు కూర్చోవడం. ఇదంటే నాకెంతో అనిష్టం, అయితేనేం ఇదోమార్గం.

అతనికి తెలుసు అందులో మరి దారిలేదని—వాళ్లు తనలోపలివన్నీ తొలిచి—అక్కడ చక్రాలూ, స్ప్రింగులూ, సమ్మెటలూ, లీవర్లు అయోమయంగా అమర్చారని ఈ యంత్రం నిర్దిష్టమైన పనిని నిర్దిష్టంగా చేస్తుందని—ఒకేపని, అనేక పర్యాయాలు తప్పు లేకుండా.

రోజంతా యంత్రంముందు కూర్చునేవాణ్ని—అమెరికన్ పరిశ్రమకి అత్యంతం సహాయపడుతూ, అతి ముఖ్యమైన టెలిగ్రాములు అతిముఖ్యమైన మనుష్యులకి తప్పు లేకుండా పంపించేవాణ్ని. నా చుట్టూ జరుగుతూన్న సంఘటనలతో నాకేదీ సంబంధమంటూ లేకపోయినా నేనుమాత్రం అక్కడ కూర్చున్నాను, అమెరికా కోసం పని చేస్తూ, నాకు కావలపిందేమిటని ఆలోచించాను. బహుశా ఒక యిల్లు నేనొక చవక రకం పూటకూళ్ళ యింట్లో ఒకణ్నే బతుకుతున్నాను. ఒక గదీ, పైకప్పూ, అరడజను పుస్తకలూ ఇవే నాకున్నవి. ఆ పుస్తకాలు, వాటిని నేను చదువలేదు.

అవన్నీ గొప్పగొప్ప రచయితల గ్రంథాలు. వాటిని చదవలేను; రోజంతా టేబిలుముందు కూర్చుంటాను, నాదేశం ప్రపంచ మంతటికీ ఐశ్వర్యవంతమైన దేశం కావడానికి తోడ్పడుతూ. నాకో మంచం వుంది. ఒక్కొక్కప్పుడు కేవలం అలిసి పోవడంవల్ల నిద్రపట్టేది. రాత్రి చాలాభాగం కడచినతర్వాతగాని, తెల్లారుతున్న సమయానికిగాని, ఎక్కడైనా పడుకున్నంతమాత్రాన నిద్ర పోలేము. నీ గది నీది కాక పోతే, నువ్వు దానిలో ఒకభాగం కాలేకపోతే నువ్వందులో నిద్ర పోలేవు. నేనుంటూన్న గది నాలో ఒకభాగం కాదు, వారానికి మూడు డాలర్లు అద్దె ఎవడిచ్చుకోగలిగితే వాడిదే ఆ గది. అక్కడ నేనున్నానంతే, బతుకుతూ, నావయస్సు దాదాపు పంధొమ్మిదేళ్లు, కించిత్తు పిచ్చితనం.

అతనికొక ఇల్లుకావాలి, అక్కడకు వెళ్ళి తన్ను తాను కలుసుకోవాలి. ఈ భూలోకంలో, ఈ సూర్యుడి కాంతిలో తనదంటూ, తన్ను కాపాడగలుగుతూ ఒక యిల్లు.

ఆరు రికార్డులనీ తనగదికి తీసుకెళ్ళాడు. తన చిన్నగదిలోని, చిన్న కిటికీలో నుంచి వెలుపలకి చూస్తే తనకు దిక్కులేనట్టు కనబడింది. ఇందుకతనికి నవ్వొచ్చింది. ఇలాంటి సంగతిమీద ఎంత తమాషాగానైనా మాట్లాడుకోవచ్చు. గదిలో అటూ ఇటూ తిరిగాడు. ఇంకా తన హాటు తలమీదనే వుంది. గదితో మాట్లాడుతున్నాడు. ఇంట్లోపడ్డాను కదూ, భేష్ అన్నాడు.

ఆ రాత్రి అతనేం తిన్నాడో నాకు జ్ఞాపకంలేదు. కాని ఇంటి యజమానురాలు కట్టించిన గ్యాస్‌పొయ్యిమీద వండుకున్నాడని మాత్రం తెలుసు. ఈ పొగ వంటకీ పనికొస్తుంది, ఆత్మహత్య చేసుకోవడానికీ పనికొస్తుంది. ఏదోతిన్నాడు, చెయ్యి కడుక్కున్నాడు. తిన్న ప్లేటు కడుక్కున్నాడు. తర్వాత ఫోనోగ్రాఫు వైపు తిరిగాడు.

ఈ హంగామా అంతా ఎందుకనే సంగతి తెలుసుకోవడానికి ఏదో కొంచెం అవకాశంవుంది. తనకి కావలసిన భోగట్టా ఈ జాజ్ సంగీతంలో దాగుందనడానికి కొంచెం అవకాశం వుంది. ఇదో ఊహ. జాజ్ సంగీతం మూలకంగా తనకి యంత్రాలనిగురించి, అమెరికన్ యంత్రాలు పనిచెయ్యడాన్ని గురించి కొంచెం అవగతమయింది. పది వేలమంది న్యూయార్కుస్త్రీలు బ్రహ్మాండమైన హాలులో వీపులు వంగిపోయి కుట్టుయంత్రాలముందు పనిచేస్తున్న దృశ్యం కళ్ళకట్టింది. పర్వతాలకన్నా బ్రహ్మాండమైన యంత్రాలను, బ్రహ్మాండమైన పనులు నిర్వహించే యంత్రాలను, శక్తిని సృష్టించేవీ, శ్రమ తగ్గించేవీ, విద్యుద్దీపాలూ, రైలింజన్లూ, టిన్ను డబ్బాలూ, బాకాలు తయారుచేసేవీ రకరకాల యంత్రాలను చూడగలిగాడు.

అదో చిన్న ఫోనోగ్రాఫు. మడిచిపెట్టడానికి వీల్లేనిది. విక్టర్ కంపెనీ వారి చిన్నరకం ఫోను. ఎన్నేళ్ళనుంచో అతనిదగ్గర వుంది. ఎక్కడికి మారితే అక్కడికి దీన్ని మోసుకెళ్ళాడు. అలా దీన్ని మొయ్యడంలో సులువు లేనేలేదు. లేదనీ తనకు తెలుసు. కాని మారిన గదులన్నిట్లోకీ, మారిన నగరాలన్నిట్లోకీ మోసుకెళ్ళాడు. నెలల తరబడి ఫోనోగ్రాఫుని ఉపయోగించకపోయినా తనతో తీసుకపోతూనే వుండే వాడు. ఎప్పుడూ ఇది తనదగ్గరే వుందంటే అదేదో నిండు. ఎప్పుడు కావలసినా వినవచ్చుకదా అని ధీమా. బ్యాంకులో ఒక పెద్దమొత్తం నిలవచేసినట్టు. ముట్టుకో డానికి భయం వేసేటంత పెద్దమొత్తం. తనకి కావలసిన పాట ఏదయినా దీనిమీద పాడించుకొని వినవచ్చు. రుమేనియా దేశపు జానపదగేయాలూ, నీగ్రో ఆధ్యాత్మిక గానం, అమెరికన్ పడమటి పాటలు, అమెరికన్ జాజ్, ఈ రికార్డులన్నీ ఉన్నాయి అతనివద్ద. ఇంత సంగీతమూ ఇంట్లోనే, ఈ రికార్డులలోనే వుంది. ఆ సంగీతం లోనే తానున్నాడు. అయినా నెలల తరబడి ఫోనోగ్రాఫుని వినలేదు. తననీ, ఫోనో గ్రాఫునీ నిశ్శబ్దం ఆవరించింది. కాలం గడిచినకొద్దీ ఈ నిశ్శబ్దాన్ని భంగం చెయ్యడం కష్టమవుతూ వచ్చింది.

చాలా నెలలక్రితమే ప్రారంభం అయింది తాను దిక్కుమాలిన వాడిననే భావం. ఒక సాయంత్రం కదుల్తూన్న బస్సులోంచి అకస్మాత్తుగా చూచాడు ఆకాశాన్ని. ఎంత భయంకరమైన సత్యం ఇది. ఆకాశమనేది ఉండడం, ఆకాశం ఉందని తెలుసుకొని, తలెత్తి అందులోకి చూసి చీకటిపడిపోతూ వుండగా అప్పుడు గ్రహించాడు తానెంత దిక్కుమాలిన వాడయిపోయాడో.

అయితే అందువిషయమై అతనేమీ దఖలు పుచ్చుకోలేదు. నా కొక యిల్లు కావాలీ అనే కోరిక అతనిలో ప్రారంభమయిందంతే, దాన్ని తెచ్చుకోవడానికి మాత్రం ఏమీ చెయ్యలేదు.

ఫోనోగ్రాఫు పక్కని నిలుచున్నాడు. దాని నిశ్శబ్దాన్నీ, తన నిశ్శబ్దాన్నీ తలుచు కుంటూ, ఈ చప్పుడు చెయ్యడానికి తాను బ్రతికివున్నట్టుగా ప్రకటించుకోవడానికి భయం వేసింది.

ఫోనోగ్రాఫుని నేలమీంచి ఎత్తి. తాను భోజనంచేసే చిన్న టేబిలుమీద వుంచాడు. బాగా దుమ్ముపట్టిపోయిన ఫోనోగ్రాఫును తీరుబాటుగా తుడుస్తూ పది నిము షాలు గడిపాడు. తుడవడం అయిపోగానే ఇదివరకటికన్నా ఎక్కువ భయంవేసి మళ్ళీ దీన్ని కిందపెట్టేద్దాం, పాడకుండా మౌనంగానే ఉండిపోనిద్దాం అనిపించిం దతని కొక్కక్షణం. తర్వాత కొంతసేపటికి మెల్లిగా కీ ఇవ్వడం ప్రారంభించాడు.

రహస్యంగా తనలో తాను ఇందులోపలి తీగ ఏదయినా తెగిపోకూడదా అని ఆశిస్తూ. అలాగ అది పాడయిపోయి పాట పలక్కపోతే తనకి ఈ ప్రపంచంలో చప్పుడు చెయ్యవలసిన అవసరం తప్పుతుందికదా అని ఆశ.

యంత్రంలో తీగ ఏదీ తెగిపోలేదని తెలిసినప్పుడు ఎంత ఆశ్చర్యపడ్డానో నాకు బాగా జ్ఞాపకం. ఇన్ని నెల్లుగా పాడకపోయినా, ఏం విచిత్రం! అనుకున్నాను. ఇంకొక క్షణంలో ఇందులోంచి ధ్వని వెలువడుతుంది. ఇలాంటి భయాన్ని మన శాస్త్రవేత్తలు ఏం పేరుతో పిలుస్తారో నాకుతెలియదుగాని విపరీతమైన భయం మాత్రం వేసింది. నేను దిక్కుమాలిన వాణ్నన్న సంగతి రహస్యంగా ఉండిపోతేనే బాగుండుననిపించింది. నాకు చప్పుడు చెయ్యాలనిలేదని నిశ్చయంగా తోచింది ఆ వెంటనే. ఎలాగూ ఈ కొత్త రికార్డులు తీసుకొచ్చాం. వీటిని కూడా మిగిలిన వాట్లలో కలిపివెయ్యడానికి ముందు కనీసం ఒక్కసారయినా వినాలనిపించింది.

ఆ రాత్రి ఆరురికార్డులూ, రెండువేపులూ విన్నాను. ఫోనోగ్రాపు మరీ పెద్ద చప్పుడుచేసి యింట్లోని మిగిలినవాళ్ళకి ఇబ్బంది కలిగించకుండా ఉండడానికని మెత్తగా వుండే సూదులు కొన్నాను. కాని, కొన్ని నెలలతరబడి మ్రోగకుండా వున్నందున ఫోనోగ్రాపులోంచి పెద్దగా ధ్వని వెలువడింది. ఆ చప్పుడువల్ల అంతవేపూ సిగరెట్లు కాలుస్తూనే ఉన్నాను. తలుపుతట్టిన చప్పుడుకూడా విన్న జ్ఞాపకముంది.

ఆ వొచ్చింది ఇంటి యజమానురాలు మిసెస్ లీబిగ్. మీరా? ఎవరో అనుకున్నాను మిస్టర్ రోమనో. కొద్దిగా సంగీతం అంతేకదూ! అన్నదావిడ.

ఔనన్నాను నేను. కొన్ని కొత్త రికార్డులు, వేగిరం ముగించేస్తాను.

తన ఇంట్లో నేనిలా ఫోనోగ్రాపును వాయించడం ఆవిడ కిష్టంలేదు. కాని నేను ఇంట్లో చిరకాలంనుంచి ఉంటున్నాను. ఎప్పటికప్పుడు అద్దె సరిగ్గా యిచ్చేస్తున్నాను. నా గదిని శుభ్రంగా వుంచుతూ వుంటాను. అందేతనే వెంటనే ఆమాటనే సెయ్యలేకపోయింది. కాని ఆవిడ అభిప్రాయం నేనెరుగుదును.

రికార్డులేవీ మంచివి కావు. అన్నీ విసుగెత్తించాయి—ఒక్కటి తప్ప. ఈ ఒక్కదానిలో ఒక చోట వాయిద్యం నన్ను అమితంగా ఆకర్షించింది. ఆ చోటనే మూడునాలుగుసార్లు ఆ రికార్డు వేశాను, ఏమిటి దీని తాత్పర్యం గ్రహించుదామని. కాని ఎక్కడా అందలేదు. శాస్త్రరీత్యా ఆ భాగం నాకు సరిగానే అర్థమయింది. కాని ఇంత వింతగా ఎందుకని నన్ను కదిల్చిందో స్థిరపరుచుకోలేక పోయాను. ఒక చక్కని ప్రేమగానానికి అది ఒక ఎదురువాద్యం. బాంజో తీగమీద జోరుగా ఎనిమిది మీట్లు. అలాగ పధ్నాలుగుసార్లు. ఈ తీగల్లోంచి వచ్చిన చప్పుడు, వదలకుండా

అన్నిమార్లు వాగిన ఆ ధ్వనిలో ఏదో వుంది. అది నాలోపలికి జొరబడింది. అగంతా ఇదివరలోనే ఎప్పుడూ నాలోవుండి ఇటువంటి ఒక ధ్వనిగా ఇంతకుముందు బైట పడనిది, ఆ రికార్డు పేరేమిటో చెప్పను. ఎందువల్లనంటే నామీద దాని ప్రభావం చాలామట్టుకు కాకతాళీయం, చాలామట్టుకు నాఒక్కడికి మాత్రమే దొరికి తీరవలసి ఉంది. ఇంకెవ్వరయినా దాన్ని విన్నప్పటికీ నన్ను కదిల్చినట్లుగా అది వాళ్ళను కదల్చదు. వాళ్ళ పరిస్థితులు ఆ సమయంలో నా జీవితపు పరిస్థితులు కావాలి. వయస్సు పంధొమ్మిదేండ్లు ఉండాలి, కించిత్తు పిచ్చితనం ఉండాలి ఇత్యాదయః. రికార్డులు దాచేపి దానిసంగతే మర్చిపోయాడతను. ఆనాటి సంగీతం కూడా ఇదివరకు తాను విని పోగొట్టుకొన్న తతిమ్మా యావత్సంగీతంలోనూ కలిసిపోయింది. ఒక వారం గడిచింది. ఒక సాయంత్రం హఠాత్తుగా, తన నిశ్శబ్దంలో, మళ్ళీ వినబడిం దతనికి ఆ ఘట్టం. ఒకటి రెండు మూడు నాలుగు అయిదు ఆరు ఏడు ఎనిమిది— పధ్నాలుగుమార్లు. ఇంకో వారం గడిచింది. మాటిమాటికీ ఆ ధ్వానం అతనికి వినబడుతోంది. ఎప్పుడైనా తాను అనిర్వచనీయమైన జీవనానుభూతి పొంది, ప్రపంచంలో అందవికారమైన వన్నింటినీ బద్దలు కొట్టెయ్యగలిగినంత బలం వున్నట్టు భావిస్తాడో అప్పుడల్లా ఆ గానం వినబడేది.

ఆదివారాలు నాకు నగరంలో ఏ పనీ వుండేదికాదు. అందుకని ఆఫీసులోనే కూర్చొనేవాణ్ని. టెలిటైప్ యంత్రంముందు కూర్చోవడమే నా జీవితమంతటికీ పెద్ద పనయిపోయింది. కాబట్టి ఆదివారాలు కూడా పనిచేసేవాడిని. కాని ఆదివారాలప్పుడు వర్తకం మందగిస్తుంది. అంచేత ఆఫీసులో కూర్చొని కునికిపాట్లు పడుతూ, కలలుకంటూ, నాకోసం సంపాదించుకొందామనుకున్న ఇల్లుగురించి ఆలోచనలు పోయేవాణ్ణి. టెలిటైప్ యంత్రం సందేశాన్ని పంపుతూ వుంటుంది. అందుకుంటూ వుంటుంది. చాలా గొప్ప యంత్రం.

ఎందర్నో పాత టెలిగ్రాఫిస్టుల్ని నిరుద్యోగుల్ని చేసింది. వాళ్ళకి గంటకి ఒక డాలరుదాకా కూలి కిట్టేది. కాని ఈ కొత్త యంత్రం అమలులోకి రాగానే వాళ్ళకి పన్లు పోయాయి. టెలిగ్రాఫీలో ఓనమాలు రాని నాలాంటి కుర్రాళ్ళకి పనులు దొరికాయి. ఈ యంత్రాన్ని కనిపెట్టడంతో బోలెడంత పని సాధ్యమయింది. చాకచక్యానికి దీన్నే మొదట చెప్పాలి.

టెలిగ్రాఫు కంపెనీలకు యాటా లక్షలకొద్ది డాలర్లు ఆదా అయింది. నేను గంటకి 28 సెంట్లు ఆర్జించేవాణ్ణి. ఇదివరలో జోరుగా సందేశం పంపగల ఆపరేటరుకన్నా అదే వ్యవధిలో నేను అంతకు రెండురెట్లు ఎక్కువ భోగట్టా సరఫరా

చెయ్యగలను. అయితే ఆదివారాలు వ్యాపారం మందంగా సాగుతుంది. అంచేత ఒక్కొక్కప్పుడు టెలిటైపు యంత్రం చాలాసేపు—అప్పుడప్పుడు ఒక గంటవరకు కూడా మౌనంగా ఉండిపోతుంది.

ఒక ఆదివారం ఉదయం చాలాసేపు మౌనంగా వుండిపోయిన పిమ్మట సాయంత్రం పలకడం మొదలుపెట్టింది. ఆ కబురేమిటో అందుకొని తనిఖీ చెయ్యాలని దగ్గరికి వెళ్ళాను. అయితే అది వార్త కాదు. మామూలు టెలిగ్రాము కాదు. మాటలు చదివాను, హెల్లో హెల్లో హెల్లో. ఈ యంత్రానికీ నాకూ ఏ విధమైన సంబంధమూ వుంటుందని నేనెప్పుడూ అనుకోలేదు. ఇతరుల సందేశాల కోసమే అదక్కడ వుంది. ఇందులో నాకీ ఆహ్వానము టిక్కుటిక్కుమనేసరికి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. సంగతేమిటంటే, ఈ యంత్రాన్ని వ్యాపారానికి సంబంధించిన వార్తలు కొట్టడానికి తప్ప యింకేపనికీ ఉపయోగించడం కంపెనీ నిబంధనలకి కేవలం వ్యతిరేకం. టెలిటైపు ఆపరేటరు అలాచేస్తే కంపెనీ డిసిప్లిను భంగపరిచినట్లు అర్థం. అందుకనే అవతలి మనిషి విషయమై నేను చాలాసేపు ఆలోచించాను. తర్వాత నేనూ హెల్లో అన్నమాట టైపు చేశాను. ఒక సంభాషణ ప్రారంభమయింది.

ఈ యంత్రాన్ని నాకు ఉపయోగకరమైన విధంగా వాడడం చాలా వింతగా కనబడింది. అవతలి ఆపరేటరుతో సుమారు ఒక గంటసేపు సంభాషించాను. ఆమె ఒక అమ్మాయి. ప్రధాన కార్యాలయంలోని ఆపరేటింగ్ రూములో పని చేస్తోంది. నేను నగరంలో వున్న అనేకమైన బ్రాంచి ఆఫీసుల్లో ఒక దానిలో పని చేస్తున్నాను. ఒక గంటసేపు చాలా చాలా ప్రసంగించాము. ఇంతట్లోకే 'యజమాని' అనే మాట చదివాను. పెద్ద అధికారి గదిలోకి వచ్చాడనీ, మా సంభాషణకి వీలుండదనీ గ్రహించాను.

అకస్మాత్తుగా నిశ్శబ్దంలో, అతనికి మళ్ళీ ఆ గానం వినబడసాగింది. ఒకటి రెండు మూడు నాలుగు అయిదు ఆరు ఏడు ఎనిమిది. మాటిమాటికీ అదే ధ్వని. దానికొక ప్రత్యేకార్థం ఇన్నాళ్ళ కతనికి స్ఫురించింది. ఒక యిల్లూ, చుట్టూ పరిశుద్ధమైన తోట, వెచ్చని సూర్యుడు, ఇంకో మనిషి.... ఒకటి రెండు మూడు నాలుగు అయిదు ఆరు ఏడు ఎనిమిది తానూ ఈ రెండో మనిషీ ఇల్లూ, భూమీ, సూర్యుడు సుస్పష్టమైన ఇంద్రియాలూ ప్రగాఢనిద్రా ఒకటి రెండు మూడు నాలుగు అయిదు ఆరు ఏడు ఎనిమిది, అర్థం సంపూర్ణత్వం, దిక్కుమాలినట్లు భావించకపోవడం, బోనులో చిక్కుకున్నామనే ఊహ మాయం కావడం.

ఈ అమ్మాయి ఎలా ఉంటుందా అని నా మనోనేత్రంలో సాక్షాత్కరించుకోవడానికి ప్రయత్నించాను. ఈమె నాతోబాటు ఈ యింట్లో కాలుపెట్టి దాన్ని మా ఇద్దరి జీవితాలతో నింపడానికి అంగీకరిస్తుందా అని అనుకున్నాను. కొంచెం సేపటికి పెలిపైపు యంత్రం మళ్ళీ కొట్టుకుంది. హెల్లో హెల్లో యజమాని వెళ్ళిపోయాడు అని చదివాను.

అమోఘంగా ఉంది ఈ నడిచిన ఫక్కీ కంపెనీ డిసిప్లిన్‌ను ధిక్కరించడం వగైరా.

సాయంత్రం అయిదు గంటలకి ఆమె పెద్ద ఆఫీసు వదలి నేను పని చేస్తున్న ఆఫీసులోకి వచ్చింది.

తాను వస్తున్నట్లు నాకు చెప్పలేదు, గాని ఆమె ఆఫీసులో అడుగుపెట్టిన తక్షణమే ఆమె ఎవరో తెలిసిపోయింది. ఎందువల్లనంటే ఆమె మొగం చూసీ చూడడంతో నాకు సంగీతం వినిపించింది, ఒకటి రెండు మూడు నాలుగు అయిదు ఆరు ఏడు ఎనిమిది, జోరుగా. ఏమిటో అయిపోతున్నాను. గభీమని నా చోటునుంచి గెంతికెళ్ళి ఆమెను కౌగిలించుకొని మా యింటిగురించి చెప్పాలనుకున్నాను.

కాని మా సంభాషణ మర్యాదగా సాగింది. ఆరుగంటలకి అతని పని ఆ రోజుకి ముగియడంతో ఇద్దరూ కలిసి ఆమె యింటిదాకా మాట్లాడుతూ నగరం దాటి నడుచుకుంటూ వెళ్లారు. అతని కా సంగీతమే పదేపదే వినిపించింది, ఎన్నో నెలల తరువాత మళ్ళీ మొదటిసారి అతడు నిజంగా నవ్వడం ప్రారంభించాడు. ఆమె అమోఘంగా వుంది. ఆమె మనస్సులో మనోహరమైన జీవశక్తి వుంది. అల్లరంటే ఆమె కిష్టం. ఆమె కళ్ళలో అతనికి భూలోకం, ఉజ్జ్వల ధాత్రి, వెలుగు వెచ్చగా నిండి, ఎదుగుతున్న వస్తువుల బలంతో కూడిన భూమి కనిపించినట్లయింది. తన ఇల్లు కట్టుకోవలసిన చోటు, తాను తానుగా బతికి ఊపిరి పీల్చవలసిన చోటు.

ఆ సాయంత్రం రికార్డును మళ్ళీమళ్ళీ వేశాడు, ఆఖరికి ఇంటి యజమానురాలు అతని గదిలోకి వచ్చి "మిస్టర్ రోమనో పదకొండున్నర అయిపోయినట్టుంది," అంది.

అమ్మాయితో మంచి స్నేహమయింది. ఇంటి గురించి ఆమెతో మాట్లాడడం మొదలుపెట్టాడు. మొదట్లో అతడంటున్న మాటలను తిన్నగా ఆమె వినిపించుకోలేదు, ఆ మాటలు అంటూన్న విధానాన్ని వింటూ వచ్చింది....తర్వాత అతడు చెప్పిన ప్రతీ మాటా విన్నది యంత్రాలు తమలో జొరబడడం అనీ, తమ్ము నాశనం చెయ్యడమనీ, తమలో సరసమైన వాటినన్నీ, నాశనం చెయ్యడమనీ అతడన్న పిచ్చిమాటల్ని వింది.

ఆదివారాలు పనిలోకి వెళ్ళడం మానేశాడు. సముద్రతీరంలో నడవడం మొదలు పెట్టారు. ప్రతి ఆదివారం సముద్రపుటొడ్డున కొండలదాకా నడుస్తూ ఇంటిగురించి మాట్లాడుకున్నారు. 1927 సెప్టెంబరు అక్టోబరు నెలలలో ఆదివారాలన్నీ శాన్‌ఫ్రాన్సిస్కో అఖాతంనుంచి కొండలదాకా నడవడంతోనే గడిచాయి.

దారి తప్పిపోయానన్న భావం అతనిలోనుంచి తొలగిపోవడం ప్రారంభమయింది. తాను బతికివున్న సంగతి తెలిసి ఆ సంగతికి ఒక ప్రాముఖ్యం ఇచ్చే మనిషి కనీసం ఒక్తె అయినా ఈ ప్రపంచంలో వుంది. తాను చిరకాలం నుంచి కోరుకుంటున్న ఇల్లు నిజంగానే రూపు కట్టినట్లుగా, అందులోకి ఈ నవ్వుతూన్న అమ్మాయితో కలిసి ప్రవేశించినట్టుగా అక్కడే ఇద్దరూ కలిసి శాశ్వతంగా వుండిపోయినట్టుగా అనిపించిందతనికి కొన్నాళ్ళు.

అతని వయస్సు పంథొమ్మిదేళ్ళని చెప్పాను కాదూ. శాశ్వతంగా, శాశ్వతంగా, అక్కడే వుంది తమాషా అంతా. రోజు పొడుగునా టెలిటైపు యంత్రం ముందు అతనికి గానం వినబడేది ఒకటి రెండు మూడు నాలుగు అయిదు ఆరు ఏడు ఎనిమిది శాశ్వతంగా శాశ్వతంగా శాశ్వతంగా. ఈ అమ్మాయి, ఈ గానం, కట్టబోయే ఇల్లూ అన్నీ మిశ్రితం అయిపోయేవి. ఓ క్షణకాలం, నిజంగానే తన ఆశ ఫలించితీరుతుందని అతని కనిపించింది.

ఇప్పుడు నేను నిజం బయలు పెడుతున్నాను. కల్పించి కథరాయడం నా కిష్టం కాదు.

ఆగస్టు సెప్టెంబరు అక్టోబరు మాసాలలో ఏదో అనిర్వచనీయకారణంవల్ల — గాలిలోనే ఆ గుణం వుందనుకుందాం — వారిద్దరూ అమోఘమైన అద్వైతభావం సాధించారు. రాగం, తాళం, శ్రుతి అన్నీ ఒక్కటిగా పెనదుకొన్నాయి. శాశ్వతత్వాన్ని కోరిన వారి స్వప్నం అసాధ్యమైన స్వప్నంగా కనపడలేదు.

ఆ యిల్లు, యింకా కావాలనే వుంది వాళ్ళకి. తీవ్రంగా వాంఛిస్తున్నారు దాన్ని. ఆగస్టు సెప్టెంబరు అక్టోబరు నెలలలో ఒండొరులను తీవ్రంగా వాంఛించుకున్నారు. ఇత్యాదయః.

ఏవేవో సంభవిస్తాయి. చెప్పకుండా చెయ్యకుండా. నిమ్మళంగా విచిత్రంగా, ఒక క్షణంలో ప్రతీదీ ఒకరకంగా కనపడుతుంది. ఇంతట్లో మరోసారి చూచినంతలో ప్రతీదీ మారిపోయి ఇంకోరకంగా కనబడుతుంది. ఇంకో ఏర్పాటు. రక్తం ఇంకోలాగ, భూమి ఇంకోలాగ, జీవితపు అర్థం ఇంకోలాగ. దీని విషయమై మనం చెయ్య

గలిగినది ఏమీ లేదు. కళ ఒక్కటే నిర్దిష్టస్పష్టరూపంతో శాశ్వతంగా నిలుస్తుంది. శాశ్వతంగా మనం కళనిమాత్రమే నమ్ముకోవచ్చును.

వాళ్ళు పోట్లాడుకోలేదు, అమ్మాయికి జబ్బుచేసి చచ్చిపోలేదు. ఇంకో కుర్రాడితో గాని డబ్బున్న ఇంకో ముసలాడితోగాని పారిపోలేదు.

అకస్మాత్తుగా ఆ గానం ఆగిపోయింది. అందలి ఎదురుదెబ్బ హరించుకు పోయింది. అది నవంబరు.

నా గదిలో కూర్చునేవాణ్ణి మామధ్య సంభవించిన దాని స్వభావాన్ని అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తూ. ఆ యిల్లు. అబ్బే ఎంత హాస్యాస్పదం. నాకొస్తూన్న జీతం మీద "నే నొక ఇల్లెలాగ కొనగలను? దారి తప్పిపోయినట్లనుకోవడమో? అదీ అసందర్భమే. వొట్టి తెలివితక్కువ ఊహ. గది ఈ కొస నుంచి ఆ కొస వరకు నడుస్తూ సిగరెట్టు తర్వాత సిగరెట్టు కాలుస్తూ, మాకోసం మేము కట్టుకున్న భవనం ఎలా కూలిపోయిందో అర్థంచేసుకోవడానికి ప్రయత్నించేవాణ్ని. నగరాన్ని వదలిపెట్టి పోవాలని ఎందుకనుకోవడం మానేశామో తెలుసుకోవాలనిపించింది. అమ్మాయి ఒక్కర్తే కాదు. నేనూ ఇంటి గురించి మాట్లాడడం మానేశాను. నాకా సంగీతం వినపడడం మానేసింది. మళ్ళీ నిశ్శబ్దం నన్ను ఆవహించింది. దాని మధ్యలో నిలబడి మళ్ళీ దారి తప్పిపోయినట్టు అనుకున్నాను.

అయితే ఈమాటు మళ్ళీ నన్ను కలుసుకోవాలనే కోరిక లేదు. పోతే పోనీలే అనుకున్నాను. అదేదో అలాగే వుండనీ ఇత్యాదయః

చలికాలపు రోజుల్లో వాళ్ళిద్దరూ క్రమక్రమంగా ఒకరికొకరు దూరమైపోయారు. ఇంతట్లో హఠాత్తుగా 1928 మార్చిలో అంతా అయిపోయిందనీ గతం మృతమైపోయిందనీ అతనికి బోధపడింది.

ఏదో అయిందామెకి. పనిపోగొట్టుకుంది. వెళ్ళిపోయింది. ఇంకో చిరునామాకో, ఇంకో నగరానికో, సరిగా అతనికి తెలియదు. ఆమె చహరా దొరికింది కాదతనికి.

జూన్‌లో అతనికేదో అయింది.

ఒక సాయంత్రం నేను టెలిప్రైపు యంత్రం ముందు పనిచేస్తూ కూర్చున్నాను. ఇంతట్లోనే హఠాత్తుగా ఆ గానం వినబడింది. ఒకటి రెండు మూడు నాలుగు అయిదు ఆరు ఏడు ఎనిమిది జోరుగా. ఆమె ముఖం నాకు కనబడడం మొదలుపెట్టింది. ఆమె నేత్రాలనే ప్రకృతిదృశ్యాలు గోచరించాయి. ఆమె నవ్వు వినబడడం మొదలుపెట్టింది. ఒకటి రెండు మూడు నాలుగు అయిదు ఆరు ఏడు ఎనిమిది యంత్రంమీద పనిచేస్తున్నప్పుడంతా ఈ సంగీతమే, ఈ పిల్ల జ్ఞాపకమే, మేము కట్టుకుందామనుకున్న ఇల్లే

ఇవన్ని ఇదివరకటిలాగే వేసవికాలంలో మేమనుకున్నట్టే కళ్ళకి కట్టినట్టే వాస్తవంగా, సత్యంగా నా మనస్సులో గోచరించి దిక్కుమాలిపోయినట్లు, దిగ్భ్రాంతి చెందినట్టు కళవళపడే వాడిని.

ఆ సాయంత్రం రికార్డు వేశాడు. కాని ఒక్కసారి మాత్రమే విన్నాడు. ఏమంటే అతని కళ్ళల్లోకి నీళ్ళు వచ్చాయి. కన్నీళ్ళు చూసి నవ్వాడు. కాని రెండో మాటు సంగీతం వినే సాహసం లేకపోయింది. మొత్తం మీద అంతా చాలా తమాషా గానే వుంది అనుకున్నాడు. సంగీతం, అమ్మాయి, ఇల్లూ అన్నీ కలిసి, ఒకే అర్థంగా తన మనస్సుకి గోచరించింది. 'తమాషాగానే ఉంది కాదూ.'

కాని ఆ మర్నాడు ఆమె ఎక్కడ వున్నదీ తెలుసుకోవాలని ప్రయత్నించడానికి ప్రారంభించాను. ఇలా దానంతటదే జరిగింది. షికారు నడుస్తుండగా నాకే తెలియకుండా ఆమె ఇదివరకున్న ఇల్లు చేరుకున్నాను. అందులో కొత్తగా దిగినవాళ్ళని ఆమె గురించి అడిగాను. ఎక్కడికి పోయిందో తెలియదన్నారు. ఉదయం ఒంటిగంటదాకా అలాగే నడిచాను. సంగీతం మళ్ళీ నాలోనికి ప్రవహిస్తోంది. తరచుగా నా కది వినిపిస్తోంది.

టెలిఫోను యంత్రంముందు కూర్చున్నప్పుడల్లా అందులోంచి వస్తూ సంగీతం అతనికి వినిపించేది. ఒకటి రెండు మూడు నాలుగు అయిదు ఆరు ఏడు ఎనిమిది. ప్రతి ఆదివారం మళ్ళీ ఆమెను నాకు అప్పగించమని యంత్రాన్నతడు ప్రాధేయపడుతూ ప్రార్థించేవాడు. ఎంత అసందర్భం. ఆమె కంపెనీలో పని చెయ్యడం లేదని అతనికి తెలుసును. ఐనా ఎప్పుడో ఒకమాటు హెల్లో హెల్లో హెల్లో అని ఆ యంత్రం పాత పలుకరింపు టైపు చేస్తుందనుకునేవాడు. అసందర్భం కాదూ. కేవలం అసందర్భం.

ఆమె గురించి అతనికట్టే తెలిసిందేమీ లేదు. ఆమె పేరు తెలుసు. ఆమె తన కెంతగా కావాలో తెలుసు. అంతే. మరి ఆ సంగీతం మళ్ళీమళ్ళీ వినబడుతుంది.

ఒక సాయంత్రం అతడు టెలిఫోను యంత్రం ముందునుంచి లేచి నిలుచున్నాడు. పనిచేసేటప్పుడు వేసుకునే కోటు విప్పేశాడు. రెండు గంటలు దాటి కొద్ది సేపయింది. పని మానేస్తున్నానని చెప్పేసి డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడు. ఈ ఐశ్వర్యం ఏదీ నా కక్కరలేదు అన్నాడు. తన గదికి వెళ్ళాడు. తనతో తీసుకు వెళ్ళదలుచుకున్న వస్తువుల నన్నిటినీ రెండు సూటుకేసులలో వేసి కట్టేశాడు.

ఫోనోగ్రాఫులనీ, రికార్డులనీ ఇంటి యజమానురాలైన మిసెస్ లీబిగ్‌కు ఇచ్చే శాడు. ఆమెతో అన్నాడు, ఈ ఫోనోగ్రాఫు పాతది. అప్పుడప్పుడు మూలుగుతుంది. ముఖ్యంగా బిథోవెన్‌గానం ఏదైనా వేసినప్పుడు. అయినా ఇప్పటికీ పనిచేస్తుంది. రికార్డులేవి అంత చెప్పదగ్గవి కావు. కొన్ని మంచి పాటలున్నాయి. కాని చాలాభాగం విసుగెత్తించే జాజ్ సంగీతం. యజమానురాలితో మాట్లాడుతున్నంతసేపూ అతనిలో సంగీతం ధ్వనిస్తూనే వుంది. నిజంగా ఈ ఫోనోగ్రాఫునీ, రికార్డులనీ ఇంకోరి ఇంట్లో వదిలిపెట్టి పోవడం బాధగానే వుంది. కాని ఇవి నా కక్కర్లేదని అతడు రూఢిగా అనుకున్నాడు.

డిపో వెయిటింగ్ రూమునుంచి ట్రెయినుదాకా నడుస్తూన్నంతసేపూ సంగీతం నా గుండెల్ని చీలుస్తూనే వుంది! ట్రెయిను కదలబోతున్న సమయానికి, ఈల వినబడ్డ వేళకి నేను నిస్సహాయంగా కూలబడిపోయి ఈ అమ్మాయికోసం ఇల్లుకోసం ఏడుస్తు న్నాను. జీవితం ఇవ్వగలిగినదానికంటె హెచ్చుగా జీవితంనుండి కోరినందుకు నన్ను నేనే అపహసించుకుంటున్నాను.

మూలం: William Saroyan

ముద్రణ: ఢంకా 1944 అక్టోబరు

William Saroyan (1908 — ) అమెరికన్ కథాకారుడు, నాటక కర్త. కథానికలకు అందెవేసిన చెయ్యి. అతని కథానికలలో పేరెన్నికగన్నవి The Daring young Man on the flying Trapeze సంకలనం (1934)లో ఉన్నాయి. స్వీయ చరిత్రాత్మక కథ My Name is Aram (1940) కూడా ప్రసిద్ధమైన కథే.